# నెయ్యంగా మారిన కయ్యం

విజయరాఘవ

ఇంటర్వల్ అయిన తరువాత లోపలికి పోవడానికిగాను గంట 'గణ, గణ' మ్రోగింది. విద్యార్థులు, విద్యార్థినులూ మెల్లగా యెవరి క్లాసులకు వారు చేరుకుంటున్నారు. ఆ కొద్దిపాటి విశ్రాంతి కాలంలోనే కన్నుమలగిన లెక్చరర్లు, డిమాన్స్ట్రేటర్లు బద్ధకంగా లేచి ఆవలిస్తూ వారివారి బాధ్యతలను నిర్వర్తించుకోవడానికి సన్నద్ధులవుతున్నారు. తత్కారణంగా ఒక విధమైన రణగొణధ్వని బయలుదేరి ఆ ప్రదేశాన్నంతా నింపివేసింది. మరికొద్ది నిమిషాల్లో ప్రశాంతవాతావరణం ఏర్పడింది.

సరళ క్లాసులో కూర్చున్న దన్నమాటే గాని, ఇంగ్లీషు లెక్చరర్ యిచ్చే లెక్చర్ సారాంశం ఆమె మెదడులోకి చీమ తలకాయంత గూడా దూరటం లేదు. ఏదో ఒక విధమైన ఈర్ష్య, ఆందోళన ఆమె ముఖంలో వ్యక్తమవుతున్నై. అందువల్ల ఆమె లెక్చర్ విందామని ఎంత ప్రయత్నించినా వినలేకపోతున్నది. తలవంచుకుని ఏదో ఆలోచించడం మొదలుపెట్టింది. ఇంతలోకే లెక్చర్ కాస్తా పూర్తిచేసి, విసవిస బయటకు నడచి వెళ్ళిపోయాడు ఆ లెక్చరర్: ఆఖరు గంట లీజర్ అవడంవల యింటికి బయలుదేరింది సరళ.

"ఎంత తిరస్కారం?......తను యెంత తెలివిగలవాడైతేమాత్రం...తన తెలివి తన దగ్గరే వుంచుకోమను......ఏదో మొన్న ఫిజిక్స్ క్లాసుకు పోకపోవడంవల కొరత పడిన నోట్సు...అందులో నాఅంతట నేనే అడుగుతే ఇవ్వకుండా వెళ్తాడా!...ఎంతవాడైతే మాత్రం, అంత అహంకారం పనికిరాదు. అభిమానమనేది తనొక్కడికే గాదు, ఎదుటివారికి గూడా వుంటుందన్న సంగతి గుర్తించలేకపోయాడు, పూర్ క్రీచర్!" అని ఇంకా యేవో ఆలోచిస్తూవుండగా, గలగల శబ్దం చేస్తూ ఒక రిక్షా అక్కడికి వచ్చింది. వెంటనే దానో ఎక్కి కూర్చొని, అడ్రెస్ చెప్పి పోనీయమంది.

సరళ ఆషంగా అనుకోవడంలో యేమాత్రం తప్పు లేదు. ఎందుకంటే వాళ్ల క్లాసుకంతటికీ ఆమే అందగత్తె...అదిగాకుండా ప్రతి విద్యార్థి ఆమెతో ఏదో విధంగా స్నేహం చేయాలని పడరాని పాట్లు పడుతూవుంటాడు. మొన్న కాలేజీ యానివర్సరీనాడు, అందులో ప్రత్యేకంగా ప్రిన్సిపాల్ గారే ఆమె నటనా కౌశలాన్ని వేనోళ్ళ పొగడటంవల్ల, ఆమెకి అంత అహంకార భావాలు కలుగడంలో ఆశ్చర్యం యేమాత్రం లేదు. అందులో తనకంటే తెలివిగలవాడైన రామారావే ఆ ముద్దాయి అవడంవల్ల ఆమె హృదయంలో చెలరేగిన ఈర్ష్య, ఆందోళనలకు అవధి లేకపోయింది.

అసలు సంగతి ఏమిటంటే మొన్న శ్రావణ శుక్రవారంనాడు తల్లి బలవంతపెట్టడంవల్ల కాలేజీకి హాజరు కాలేకపోయింది. దాని ఫలితంగా అనాటి ఫిజిక్స్ క్లాసులో లెక్చర్ కాస్త పోయింది. సరళకు దానిని యేవిధంగా సంపాదించడమా అన్న సమస్య బయలుదేరింది. ఉన్నట్లుండి రామారావు వచ్చాడు ఆమె వూహాపథంలోకి...అతడు.ఆ క్లాసులో మంచి మార్కులు తెచ్చుకొనేవారిలో ప్రథమశ్రేణికి చెందినవాడు. అతని చదువేదో అతనిదేగాని, అల్లరి చిల్లర పనులంటే అతనికి తగని చిరాకు...అతడిని అడుగుదామనుకుంది!...కాని...ఈ కాలేజి కుర్రాళ్లకు అసలు బుద్ధి అనేది లేనేలేదు!...ఎవరైనా ఒక అమ్మాయి, ఒక అబ్బాయితో మాట్లాడిందంటేసరి, మరునాటికి వారిద్దరి పేరు కాలేజీ నాలుగు గోడల మీద పెద్ద పెద్ద అక్షరాలతో ప్రత్యక్షమవుతై!...ఇంకెవరినన్నా అడుగుదామంట తన స్నేహితురాండ్రంతా తనకంటే జూనియర్ లోనే వున్నారు...పోనీ క్లాస్ మేట్సుని అడుగుదామంటే అభిమానమొకటి అడ్డు వచ్చింది. సత్యభామకు, రుక్మిణీదేవికి వున్న మాత్సర్యం వున్నది ఈమెకు వారికీ మధ్య...అందువల్ల ఇహ గత్యంతరం లేక అతన్నే అడుగుదామని నిశ్చయించుకుంది.

మరునాడు కాలేజీకి వచ్చిన తరువాత రామారావుతో మాట్లాడటానికి ఇంటర్వల్ లోగాని తటస్థపడలేదు. కొద్దిసేపు అడుగుదామావద్దా అని తీరా నోరువిడిచి అడిగితే యిస్తాడో యివ్వడోనని - ఈవిధమైన ఆలోచనలతో డోలాందోళితమనస్కయై నిలిచిపోయింది వరండాలోనే. ఇంతలోకే లోపలికి వెళ్లేగంట కొట్టారు!...ఒక్కసారి వులిక్కిపడి ఎదురుగా వస్తున్న రామారావుని చూచింది!...కాని అదేమి చిత్రమోగాని తన్ను అతడు దాటిపోయేదాక అట్లాగే నిలబడి చూస్తూ వూరుకుంది. తీరా దాటిపోయిన తరువాత "మిస్టర్ రామారావ్!...మీ ఫిజిక్స్ నోట్సు కాస్త యిస్తారా!...మళ్లీ రేపు తెచ్చి యిచ్చేస్తాను!" అన్నది కొద్దిగా తడబడే కంఠంతో, తొందరగా వెళ్ళి అతన్ని కలుసుకుంటూ.

"మిస్టర్ రామారావ్!" అని పిలవగానే రామారావు స్టన్ అయిపోయాడు. "ఇదేమిటి? నన్ను పిలుస్తుందేమిటా!" అని నిర్ఘాంతపోయాడు ఒక్క నిమిషంపాటు. మరుసెకండులో అతని మస్తిష్కంలో



# ★ నెయ్యంగామారిన కయ్యం ★

వివిధ ఆలోచనలు చెలరేగినై...ప్రిన్సిపాల్ చేతిలో ఈమె మూలకంగా విద్యార్థులుపడ్డ పాట్లు ఒక్కసారి కళ్ళముందు మెదిలినై... ఒక్కసారి ఆమెవైపు తేరిపార జూచి కుఱు సెకండులో చరచర నడచి వెళ్ళిపోయాడు తన క్లాస్ రూంలోకి!

అతిరస్కారమే సరళ హృదయంలో ఆరని జ్వాలయై చెలరేగింది. రిక్షాలో కూర్చున్నది మొదలు అతగాడిని తిరిగి ఏ విధంగా పరాభవించడమా అని ఆలోచిస్తూనేవున్నది ఇల్లు చేరేదాకా. తరువాత వాడికి డబ్బు లిచ్చి పంపించేసి తన రూంలోకి వెళ్లి ఒక కుర్చీలో కూలబడ్డది. అప్పటికే వివిధమైన ఆలోచనలతో మెదడు వేడెక్కిపోయి వుండటంవల్ల నిద్రాదేవి ఆమెను గాఢంగా తనహృదయానికి హత్తుకున్నది. ఆ కూర్చున్నదిగూడా పడకకుర్చీయే కావడం వల్ల సాయంకాలం నాలుగింటిదాకా ఆ నిద్రకు యేవిధమైన ఆటంకమూ కలుగలేదు. తిరిగి "ఓసి! నీపిల్ల పీచుగాను!...ఇదెక్కడి నిద్ర లేవ్!...ఇప్పుడే యిట్లాఅయితే రేపు అత్తగారింటికి పోతే యెట్లాచేస్తావో యేమో!" అన్న వాళ్ళ బామ్మమాటలకుగాని మెలకువ రాలేదు.

"అబ్బ!...వుండవమ్మా! నీదొకగోల... కాసేపు పడుకుంటేసరి ఒకటే డిష్టర్బెన్స్" అని విసుక్కున్నది.

"లే, లే!...నాలుగుగంటలైతే గూడా యింకా నిద్రేమిటే పాపమ్మా!...ఆ అమ్మాయి ఎవరో చూడు, పేరంటానికి పిలవటానికి వచ్చింది!" అని లోపలికి వెళ్లిపోయింది బామ్మ.

"ఆ!...నాలుగైందా! ఎప్పుడూ లేనిది యీరోజింత నిద్రపట్టిందేమిటి చెప్మా! "అని బద్ధకంగా ఆవలిస్తూ దొడ్లోకి పోయి మరునిమిషంలో ముఖమూఅదీ కడుక్కొని తన గదిలోకి వచ్చింది సరళ. ఇప్పుడామెముఖంలో మునుపటి ఆందోళన ఛాయామాత్రంగా గూడా లేదు.

ఇంతలోకే వాళ్లఅమ్మ సావిత్రమ్మగారు ఆవచ్చినమ్మాయి అక్కడికి వచ్చారు. సరళకు బొట్టుపెట్టి ఆఅమ్మాయి వెళ్లిపోయింది.

తనకు తెలిసినంతవరకు యెక్కడా ఆ వచ్చిపోయినమ్మాయి ఆచోకీ దొరక్కపోయేసరికి "ఎవరేఅమ్మా?" అన్నది సరళ ముఖంలో కొశ్చన్‌మార్కు వేసి.

"క్రొత్తగా వచ్చారులే! నిన్ననే యిల్లు మారారుట. ఆప్రక్కవీధిలో రెండోయిల్లే" అన్నది సావిత్రమ్మగారు.

ఆప్రక్కవీధిలో రెండోయిల్లు పచ్చని తోరణాలతో కళకళలాడుతూ వున్నది. సరళ అక్కడికి పోయేసరికి, అప్పటికే ముత్తయిదువులంతా హాజరయ్యారు యేవొక్కరో యిద్దరో తప్ప...ఆరోజు ఆ క్రొత్తగా వచ్చినవారి అమ్మాయి రెండో తమ్ముడి పుట్టినరోజు పండుగ!...మరి కొద్ది సేపటిలో సావిత్రమ్మగారుగూడా వచ్చింది అక్కడికి. ఇద్దరూ కలిసి లోపలికి వెళ్ళారు.

ఆ తంతు అంతా ముగిసేసరికి ఆరుగంటలైంది. ఒక్కొక్కరే యిళ్ళకు వెళ్ళిపోయారు. కాని సావిత్రమ్మగారు, సరళ మాత్రం అక్కడే వుండిపోవలసివచ్చింది కొంతసేపటివరకు. వీరికి వారూ, వారికి వీరూ క్రొత్త అవటం వల్ల; వారి విషయాలు వీరూ, వీరి విషయాలు వారూ తెలుసుకున్న తరువాత, దగ్గర బంధుత్వం గూడా వున్నట్లు వారిరువురికి యిట్టే తెలిసిపోయింది. సరళ కిదంతా చాల సంతోషాన్ని కలుగజేసింది. స్నేహితులతో కలిసి తిరగడం అంటే ఆమెకు మహా సరదా!...పద్మతో కలిసి వాళ్ల యిల్లంతా తిరిగి చూడటం మొదలు పెట్టింది.

పద్మ అవీ ఇవీ చూపుతూ చివరకు ఒక గదిలోకి తీసికొనిపోయింది. దానినిండా యేవేవో పెయింటెడ్ పిక్చర్స్ వ్రేలాడుతున్నై. 'రాధా మాధవలాస్యం', 'ధ్యానమగ్నుడైన బుద్ధభగవానుడు', 'విరహిణీ-ఊర్మిళ', 'వసంతఋతు ఆగమనం'-ఇలాంటి చిత్రాలు ఎన్నో వున్నై. వాటిలో కొన్ని సంపూర్ణమైనవీ, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నవీ - సరళ వీటన్నింటినీ ఒక్కొక్కటీ పరిశీలిస్తున్నది. "వీనినింత బాగా చిత్రించిన చిత్రకారు డెంతటి గొప్పవాడో" అన్నది వాటిలో ప్రతిబింబించే సహజత్వాన్ని, ఆ చిత్రకారుని కుంచెలోని మెరుగుల్ని అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ.

"సరళా!......వీటిని చిత్రించినది ఏ గంధర్వమూర్తో గాదు...ఇది మా అన్నయ్య గది. ఇవన్నీ వాడు గీసినవే!...వాడికి యిదొక సరదా!" అని యింకా ఏదో చెప్పబోతుంటే వాకిలిదగ్గర యేదో అలికిడైంది. "అదిగో!...మా అన్నయ్య వస్తున్నాడు!" అన్నది పద్మ.

రామారావు గదిలోకి అడుగుపెట్టాడు. ఎవరో క్రొత్తవారుండటం చూచి వెనుదిరిగిపోబోయాడు. కాని పద్మ అతడిని పోనీయకుండా, "అన్నయ్యా!...మమ్మ చూచి భయపడి పారిపోతున్నా

---

ఒక కోతలరాయుడు:
"నాకు అద్భుతమైన గురి ఉంది. ఒకసారి నేను అడవిలో వేటకి వెళ్ళి కళ్లు మూసుకుని తుపాకి పేల్చాను. కళ్లు తెరిచి చూస్తే ఎదురుగా ఒక పెద్ద పులి చచ్చిపడి ఉంది."

శ్రోత: "ఎన్నాళ్ళనుంచీ పడిఉందో పాపం?"

---


ఇప్పుడు
లోధ్ర బుడ్లను
నకిలుకు వీలులేని సీళ్ళు



లోధ్ర
50 సంవత్సరాలకు పైగా
పేరొందిన
సుప్రసిద్ధ గర్భాశయ రోగనివారిణి
కేసరి కుటీరం లిమిటెడ్, రాయపేట, మద్రాసు. 14.
ఆంధ్రరాష్ట్రమునకు ఏజెంట్లు: సీతారాం జనరల్ స్టోర్సు ఏజెన్సీస్, విజయవాడ.

వేమిటి?...లోపలికిరా!...నిన్ను చూడటానికి వేచివున్నాం!" అంటూ చేయి పట్టుకొని లోపలికి తీసుకొనివచ్చింది.

నిజంగా పద్మ చాల చిలిపి పిల్ల! ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని వుడికిస్తూవుంటే గాని ఆమెకు సంతోషంగా వుండదు. సరళకు స్నేహితులతో తిరగడం సరదా అయితే, పద్మకు యిదొక సరదా!

ఆ సమయంలో రామారావుని చూడగానే సరళ ఆశ్చర్యపడ్డది. మరునిముషంలో యెక్కడలేని సిగ్గు ముంచుకుని వచ్చింది. ఆ క్రిందటిక్షణంవరకూ రామారావుని పరికిస్తున్న ఆమెచూడ్కులు, అతడు ఆమెవైపు ఎప్పుడైతే చూచాడో సరాసరి క్రిందికి వాలి నేలమీద చీమల్ని లెక్కపెట్టసాగాయి. అంతకుముందు అతనిపట్ల వున్న ఈర్ష్య, కోపం పటాపంచలైపోయినై. ఆస్థానంలో అతనంటే ఒకవిధమైన అభిమానం నిండిపోయింది. ఇంచుమించు రామారావుకూడా అదేస్థితిలో పడిపోయాడు హఠాత్తుగా సరళను తనయింటిదగ్గర చూచేసరికి. వారిరువురినీ చూచి పద్మ విస్మయంజెంద మొదలుపెట్టింది. ఆమెవెంట బయటికి వెళ్లిందిసరళ.

సావిత్రమ్మగారు, సరళ, ఇంటికి పోబోతున్న సమయంలో, పద్మ ఒక పుస్తకాన్ని తీసికొనివచ్చి సరళ చేతి కిచ్చింది. "ఇది మా అన్నయ్య నీకివ్వమన్నాడమ్మా!...జాగ్రత్తగా పట్టుకొనివెళ్లు!" అని నవ్వి "మాయింటికి వస్తూవుంటావుగా!" అన్నది. సావిత్రమ్మగారు ఇదంతా ఏమీ అర్థంగాక సరళవైపు చూచింది.

"ఆ!...ఏమీ లేదే! ఈమె అన్నగారు కూడా మాకాలేజే!...క్లాసునోట్సు అడిగితేను, ఇచ్చాడు అంతే!" అన్నది క్లుప్తంగా.

ఇంటికి పోయిన తరువాత రామారావు వింత మనస్తత్వానికి చాల ఆశ్చర్యపడ్డది. ఇదివరకు కాలేజీలో అడిగినప్పుడు ఇవ్వనివాడిప్పుడెట్లాయిచ్చాడా! అని...అన్నట్లు అతగాడిని చూడంగానే నేను అట్లా అయిపోయానేమిటి?...క్రిందటిక్షణంవరకు అతడంటే కారాలు మిరియాలు నూరిన నాహృదయము అతనిపట్ల ఇప్పుడింత ప్రశాంతత వహించిందేమిటి?" అని తర్కించుకుంది మనస్సులో. కాని ఆప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఎప్పుడైతే సమాధానం దొరకలేదో, అతగాడిని గురించి ఆలోచించటం ఎక్కువైంది. తత్కారణంగా ఆమెమనస్సు అతనిపట్ల మరింత ప్రశాంతత వహించింది.

ఆతరువాత రామారావు యింటికి వెళ్లామని యెంత ప్రయత్నంచేసినా పోలేకపోయింది. దానికి కారణం ఆమెకు తె[illegible]ల్సిందే!

**ఒకరోజు సావిత్రమ్మగారు, పద్మ యింట్లో**

లేని సమయంలో భర్తతో అంది. "ఏమండీ! మిమ్మల్నే...మీ సంగతేదో మీదేగాని, ఇంట్లో సంగతి మీకేమైనా పట్టిందా ఏమన్నానా!...ప్రొద్దస్తమానం ఆ ఆఫీసు పనే వుంది! మీరే వున్నారు!"

ఆ మాటలను యేదో రాసుకుంటున్న రాఘవయ్యగారు, 'ఈ అకాల ప్రళయమేమిటా!' అని కళ్ళజోడులోనుంచి అదో విధంగా సావిత్రమ్మగారివైపు చూచారు. తనవేపు తదేకదృష్టితో చూస్తున్న ఆయన్ను చూచి సావిత్రమ్మగారు క్రొత్త పెళ్లికూతురులా సిగ్గుపడ్డది. అది చూచి రాఘవయ్యగారు రెచ్చిపోయారు. "అసలు సంగతేమిటంటే అలా అయిపోతున్నావేమిటి?... నీవు పెళ్ళికూతురైతే అయ్యావుగాని నేను మాత్రం పెళ్ళికొడుకు కాలేను బాబూ" అన్నారు.

"అదిగాదండి! సరళ సంగతి చూడండి!...రోజు రోజు కెట్లా అయిపోతున్నదో!...చదువుమాటేగాని, దాని పెళ్ళి సంగతి మీకేం పట్టినట్లులేదు మాకే!" అన్నది సావిత్రమ్మగారు.

"ఆ విషయంలో నాకేమాత్రం జోక్యం వుండబోదు!...అంతా దాని యిష్టం!" అన్నారు రాఘవయ్యగారు.

తరువాత సావిత్రమ్మగారు సరళను తరచి తరచి అడగటం, సరళ సగం సిగ్గూ, సగం తడబాటుతో చెప్పడం; రాఘవయ్యగారు, రామారావింటికి వెళ్ళి తాంబూలాలు పుచ్చుకోవడం; వెంటనే పురోహితుడు వచ్చి శుభముహూర్తం నిశ్చయించి వెళ్ళడం క్రమంగా జరిగినై. ఆపైన అనుకున్న ముహూర్తానికే వివాహం కూడా జరిగిపోయింది.

రామారావు, ఆనాటిరాత్రి శరత్కాలపు వెన్నెలతో మెరిసిపోతున్న పాన్పుపై కూర్చొని, తన వధువు సౌందర్యాన్ని ఊహాలోకంలోనే చూచి ఆనందిస్తున్నాడు. ఇంతలోనే 'శరచ్చంద్రిక నాతో యేమి సరిపోలుతుంది' అన్నట్లు, తెల్లని నాగకుబుసంలాంటి వలువలు ధరించి సరళ లోపలికి అడుగిడింది. ఆమె జడలో అలంకరించిన మల్లెల సౌరభం సరాసరిపోయి ఊహాప్రపంచంనుండి అప్పుడే తేరుకున్న రామారావు నాసారంధ్రాల్లో ప్రవేశించి, అతనికి గిలిగింతలు పెట్టింది. రామారావు మెల్లగా ఆమె దగ్గరికి వచ్చాడు. "సరళా!"...అన్నాడు. ఆ పైన అతని గొంతు యిక పలుకలేకపోయింది. ఆ పిలుపు విని సరళ తలెత్తి చూచింది పులికిపడి. మరునిముషంలో సిగ్గుదొంతరలు ముంచుకొచ్చినై. ఆమెను తనవైపు త్రిప్పుకున్నాడు అతడు.

★


రవి టాయిలెట్స్
అందమునకు, ముఖవర్చస్సుకు


సోల్ ఏజంట్లు:—
వి మ్యాక్లస్టార్ & కో., మద్రాసు-21



మీ బిడ్డ...
1, 3 సంవత్సరముల మధ్య, శాకాహారులైన మగ బిడ్డలలో, లివర్ వ్యాధులు సామాన్యమని, మా లెక్కలవల్ల తేలుచున్నది.
తరుచుగ అజీర్ణ వ్యాధులు, కడుపు ఉబ్బరము, చికాకు పడుట, కోపము, ఆకలి మందగించుట మొదలైన గుణములు లివర్ వ్యాధిని సూచించు లక్షణములు.
వకాలంలో జమ్మిగారిని సలహా తీసుకోండి


జమ్మిస్
లివర్ క్యూర్
జమ్మి వెంకటరమణయ్య & సన్సు
జమ్మి బిల్డింగ్సు, మైలాపూర్, మద్రాసు-4.